క్లుప్తంగా

సాగర్ నీరు వృథా



ట్యాప్ నుంచి వృథాగా పోతున్న సాగర్ నీరు

పుల్లలచెరువు: అసలే కష్ట కాలం నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మండల కేంద్రంలో పాత ఏపీజీబీ బ్యాంక్ వద్ద ఉన్న సాగర్ పైపు లైను లీకైంది. నీరు వచ్చినప్పుడు ట్యాప్ నుంచి నీరు వృథాగా పోతోంది. ఊరిలో ఉన్న ఎకైక ట్యాప్ అది ఒక్కటే. అక్కడ నీరు ఎవరు పట్టుకోరుగానీ నిత్యం దాని నుంచి నీరు వృథాగా పోతోంది. కనీసం పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అది చూసే ప్రజలు దాన్ని ఆపుదామని కాగితాలు, కర్రపుల్లలు అడ్డం పెడితే ఉంటుందా.. దానికి బిరడా లేక పోవడంతో నిత్యం నీరు వృథాగా పోతోంది. దాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెద్దదోర్నాల: భూమి ఉన్న ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చింతల, తుమ్మలబైలు గిరిజన గూడేల్లో మట్టి నమూనా సేకరణపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకుని ఎరువుల యాజమాన్యం పాటించాలని తెలిపారు. సూక్ష్మపోషకాల యాజమాన్యం పాటించాలని తెలిపారు. భూసార పరీక్ష ఫలితాల కార్డులను రైతులకు పంపిణీ చేశారు. పట్టాలు ఉన్న ప్రతి రైతు తప్పని సరిగా రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం గురించి అవగాహన కల్పించినట్లు వ్యవసాయాధికారి తెలిపారు. వీఏఏ విశ్వనాథ్, ఎన్‌జీఓ సిబ్బంది ప్రసాద్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రాజయ్య, కాశయ్య పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య

పెద్దారవీడు: ప్రజా సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశం అధికారులు మొక్కుబడిగా నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. శుక్రవారం ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం గంట సేపటికే ముగిసింది. అయితే ఈ మావేశానికి పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు కూడా తూతూ మంత్రంగా ప్రగతి నివేదికలను చదివి వినిపించిన వెంటనే సమావేశం నుంచి బయటకు వెళ్లి పోయారు. సభలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ, సర్పంచులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, దీనిపై ప్రతి సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో ఉండే సమస్యలు తెలియజేసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. గ్రామాల్లోని సమస్యలు పరిష్కారం కానప్పుడు మండల సర్వసభ్య సమావేశం ఎందుకని అధికారులను ప్రశ్నించారు. చాలా మంది మండల స్థాయి అధికారులు సభకు హాజరు కాకపోవడంతో ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య, ఉపాధి పనుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ అధికారులు బాధ్యతగా పని చేస్తూ ప్రజాప్రతినిధులకు సరైన గౌరవం ఇవ్వాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు సక్రమంగా సాగుతాయన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జాన్‌సుందరం, ఆర్‌ఐ శివ, ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం, విద్యుత్ ఇన్‌చార్జి ఏఈ ఏర్వ నాగేందర్‌రెడ్డి, ఏఓ బుజ్జిబాయి, డాక్టర్ బాలునాయక్, ఇన్‌చార్జి ఏపీఓ సుజాత, ఆరోగ్య హెల్త్ సూపర్‌వైజర్ సభానీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరికరాలున్నా ఉపయోగం సున్నా!

- వైద్య పరికరాలను ఉపయోగించని ఫిజియోథెరపీస్టులు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామంటున్న నిరుపేదలు



వినియోగించని ఫిజియోథెరపీ పరికరాలు



పెద్దదోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రం

పెద్దదోర్నాల:

అంగ వైకల్యాన్ని అధిగమించడమే కాకుండా భరించలేని నొప్పితో బాధ పడేవారికి ఫిజియోథెరపీ సాంత్వన చేకూరిస్తుంది. దీంతో పాటు ఎటువంటి మందులు వాడకుండానే నొప్పులతో బాధపడే వారికి ఫిజియోథెరపీ ఉపయోగపడుతుంది. అవయవ లోపంతో పుట్టిన చిన్నారులకు, ప్రమాదాల్లో అవిటి వారైన యువతకు, నడుము, కీళ్ల నొప్పులతో బాధపడే వృద్ధులకు ఉపశమనం ఫిజియోథెరపీ ఇస్తుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఫిజియోథెరపీ సేవలు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అంతంత మాత్రంగానే అందుతున్నాయని రోగులు వాపోతున్నారు. దీంతో ఫిజియోథెరపీ కోసం ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తూ వందల రూపాయలు చెల్లిస్తున్నామని బాధితులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు నామ మాత్రంగానే అందుతుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్షవాతం బాధితులు, ప్రమాదాల్లో గాయపడిన వారు, దీర్ఘకాలికంగా నొప్పులతో బాధ పడుతున్న వారికి ఫిజియోథెరపీతో ఎంతో ఉపశమనం కలుగుతుంది. ఈ సేవలను గ్రామీణులకు కూడా అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో గతంతో ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రాలకు ఫిజియోథెరపీ పరికరాలను అందజేసింది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి లక్షల రూపాయల విలువ చేసే పరికరాలు అందజేయడంతో పాటు సిబ్బందిని సైతం నియమించింది.

సేవలు అంతంత మాత్రమే

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫిజియోథెరపీకి సంబంధించిన వైద్య పరికరాలు ఉన్నా వాటిని వినియోగించి రోగులకు ఫిజియోథెరపీ చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. చాలా మంది కీళ్ల నొప్పులతో పాటు వివిధ రకాల రుగ్మతలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యశాలలో టెన్స్, ఇంటర్ ఫెరిన్షియల్ థెరపీ, అల్ట్రాసోనిక్ థెరపీ, ఎలక్ట్రికల్ స్టెమిలేటర్, షార్ట్ వేవ్ డయాటర్మీ, సీపీఎం డివైస్, లేజర్, ట్రెడ్‌మిల్, బైసైకిల్ ఆర్గోమీటర్, క్వార్డిసెట్స్ టేబుల్, పార్లల్ బార్, షోల్డర్ వీల్, స్విస్ బాల్స్ వంటి పలు వ్యాయామ పరికరాలు వినియోగించి రోగులకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. దీంతో పాటు 8 అంకెలపై, రెండు సరళ రేఖల మధ్య నడిపి ఫిజియోథెరపీ చేయాల్సింది. దీంతో కీళ్లు బిగుతుగా మారకుండా కదలికలు యథావిధిగా ఉండేలా రక్తప్రసరణ యథావిధిగా జరిగేలా ట్రీట్‌మెంట్ ఇస్తారు. ఇన్ని రకాల సేవలు చేయాల్సి ఉన్నా వాటిని రోగుల కోసం వినియోగించటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి బాధితులకు మెరుగైన ఫిజియోథెరపీ సేవలు అందేలా చూడాల్సి ఉంది.

ఒక్క పరికరం కూడా ఉపయోగించరు:

నా కూతురికి నడకలో కొంత ఇబ్బంది ఉంది. దీంతో ఫిజియోథెరపీ కోసం నా కూతురితో కలిసి వైద్యశాలకు వెళ్తుంటాను. అక్కడ సలహాలు ఇస్తారు తప్ప దైనా పరికరం వినియోగించి కొంత మేర నడకలో ప్రాక్టీసు కూడా చేయించరు. అదేమని అడిగితే పరికరాలు లేవని చెబుతున్నారు.

శ్రీలక్ష్మి, బాధితురాలి తల్లి, పెద్దదోర్నాల

గ్రామాల్లో డెంగీపై ప్రజలకు అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



తాళ్లూరు: డెంగీపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

దర్శి (కురిచేడు): జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి డెంగీ నివారణ గురించి వివరించారు. వైద్యాధికారి చేతన్ మాట్లాడుతూ దోమ తెరలు వాడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని, ఉడికించిన వంటలు వేడిగా తినాలని సూచించారు. మలేరియా ఇన్‌చార్జి బసవారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, సుహాసిని, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

తాళ్లూరు: పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని డాక్టర్లు మౌనిక, శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని తూర్పు గంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ చేశారు. డాక్టర్లు మాట్లాడుతూ డెంగీ దోమకాటు ద్వారా వస్తుందని, మంచినీటి నిల్వలోనే గుడ్లు పెడుతుందని చెప్పారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, విపరీతమైన కండరాలు, కీళ్ల నొప్పులు, కళ్ల నొప్పులు, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుర్ల నుంచి రక్తస్రావం ఉంటే డెంగీగా భావించాలని చెప్పారు. డెంగీతో బాధపడే వారు వెంటనే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందాలని కోరారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమతెరలు, వేపాకు పొగ వేసుకోవాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూడాలని, ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలన్నారు . దోమకాటు వచ్చే వ్యాధులతో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్లు తెలిపారు. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, మౌనిక, హెచ్ఈ కె.చంద్రశేఖర్, పీహెచ్ఎన్‌లు రమణమ్మ, సుశీల ఏఎన్ఎం అనిత పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దారవీడు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ జగదీష్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యశాల సిబ్బంది మండల కేంద్రం పెద్దారవీడులో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ టైగర్ మస్కిటో అనే దోమ కాటు వేయడం ద్వారా డెంగీ వస్తుందని, ఈ దోమ ఎక్కువగా మంచి నీటి ప్రదేశంలో పెరుగుతుందని, ఎక్కువ కాలం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఇంట్లో ఉన్న డ్రమ్ములు, తొట్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇళ్ల ముందు మురుగు కాలువల్లో నీరు ఎప్పటికప్పుడు పారే విధంగా చూసుకోవాలని చెప్పారు. ఇళ్లలో ఉన్న పాత కూలర్లు, కొబ్బరి బోండాలు, కాలి టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వాడిన కొబ్బరి బొండాలను వెంటనే కాల్చి వేయాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ వెంకట్రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరినాథ్, మలేరియా, ప్రాథమిక కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్లు ఇజ్రాయిల్, సుభానీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



దర్శి: చందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

దర్శి (కురిచేడు): మండలంలోని చందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బ్లెస్సీ ఆదేశాల మేరకు జాతీయ కీటక జనిత నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. డెంగీ నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ తన వంతు భద్రత పాటించాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. పాత్రలపై మూతలు ఉంచాలని, పరిసరాలను పరిశీలించాలని, అన్ని పాత్రలపై కవర్లు వేయాలని వైద్యాధికారి బ్లెస్సీ సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ వసంత్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ జ్యోతిబాబు, ఏఎన్ఎం లీలా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తీగలేరు కాలువతోనే కరువు దూరం



పోస్టుకార్డు ఉద్యమంలో రైతులు

పుల్లలచెరువు: తీగలేరు కాలువకు నీరు వస్తేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, కరువు కూడా పోతుందని వై.పాలెం నియోజకవర్గ రైతు సంఘ గౌరవ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. తీగలేరు కాలువ సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మల్లాపాలెంలో అధ్యక్షుడు గురునాథం ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ మండలంలో చాలా గ్రామాల్లో తాగు, సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో శాశ్వత నీటి సౌకర్యం లేకుంటే ఎడారిగా మారే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ఆశాకిరణమైన వెలుగొండ ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తి చేసి దానికి అనుసంధానంగా ఉన్న టీ5 కాలువను చిన్నకండ్లేరు ప్రాజెక్టు వరకు పొడిగించి దానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. కమిటీ సభ్యులు గురునాథం, రఘు మాట్లాడుతూ ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు మారుతున్నారుగానీ వెలుగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు శాశ్వత నీటి సౌకర్యం ఉందని, పశ్చిమ ప్రాంతంలో ఉండే ప్రజలు నీటి కోసం భగీరథ యత్నం చేస్తున్నారని, ప్రభుత్వం నుంచి స్పందన వచ్చే వరకు పోస్టుకార్డు ఉద్యమం ఆగదని, తీగలేరు కాలువ వస్తే మండలంలో సుమారు 11 వేల ఎకరాలు సాగు అవుతుందన్నారు. మండలంలోని ప్రతి రైతు ఈ ఉద్యమానికి సహకరించాలని కోరారు. కమిటీ సభ్యులు కోటిరెడ్డి, ఆవుల వెంకటరెడ్డి, శనగ సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

అర్ధవీడు ఎమ్మార్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు

అర్ధవీడు: మండల కేంద్రమైన అర్ధవీడులోని ఎమ్మార్సీకి మొదటి విడతగా 15,426 పాఠ్య పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ-2 మేఘావత్ లక్ష్మీనాయక్ తెలిపారు. పాఠ్య పుస్తకాలను తరగతుల వారీగా సీఆర్పీలతో విభజిస్తున్నట్లు చెప్పారు. రెండో విడత పాఠ్య పుస్తకాలు వచ్చిన తర్వాత పాఠశాలలకు అందజేస్తామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మ తల్లి తిరునాళ్ల



అంకమ్మ తల్లి మూలవిరాట్

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని ఈదరలో వేంచేసి ఉన్న శ్రీ అంకమ్మ తల్లి తిరునాళ్ల శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి పొంగళ్లు నైవేద్యం తయారు చేసి అమ్మవారికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. పిలిస్తే పలికే దైవం, కోరిన కోర్కెలు తీర్చే దేవతగా ఆ ప్రాంత ప్రజలు విశ్వసిస్తారు. ఆలయ పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

చిన్నారులతో ఎమ్మెల్యే తాటిపర్తి సందడి



చిన్నారులతో ఎమ్మెల్యే తాటిపర్తి

పుల్లలచెరువు: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ఒక వేడుకలో యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న చిన్నారులు ఎమ్మెల్యే తాటిపర్తితో ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. దీంతో చిన్నారుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాములు, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, జిల్లా ఆక్టివిటీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, నాయకులు ఓబుల్‌రెడ్డి, బి.సుబ్బారెడ్డి, గడ్డం సుబ్బయ్య పాల్గొన్నారు.

భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భ్రమరాంబ అమ్మవారిని అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అష్టోత్తర పూజలు, కుంకుమ పూజ చేశారు.

తురాయి పూల సోయగం



ప్రజలకు స్వాగతం పలుకుతున్న తురాయి చెట్టు పూలు

పుల్లలచెరువు: సీజనల్‌గా పూచే పువ్వులు అందరినీ ఆకర్షిస్తుంటాయి. వేసవి కాలంలో తురాయి చెట్టు పువ్వులు ప్రత్యేక ఆకర్షణంగా ఉంటాయి. కుంకమ వర్ణంలో ఉన్న ఈ పువ్వులు ఎంతో దూరంగా ఉన్నా అటుగా వెళ్లే వారి మనసును దోచేస్తున్నాయి. పుల్లలచెరువు ప్రధాన రహదారి పక్కన, వై.పాలెం వెళ్లేటప్పుడు ఊరి బయట స్వాగతం పలుకుతూ తురాయి చెట్టు పువ్వులతో ప్రజలను ఎంతో అందంగా కనువిందు చేస్తున్నాయి.

ముళ్ల కంప తొలగింపు



గ్రామస్తులతో సర్పంచ్ వెంకటేశ్వరనాయక్

పుల్లలచెరువు: దారి వెంట వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన సర్పంచ్ తన సొంత నిధులతో దారి వెంట ఉన్న ముళ్ల చెట్లను పూర్తి తొలగించిన సంఘటన మండలంలోని సుద్దకురవ తండా పరిధిలో శుక్రవారం జరిగింది. వివరాలు.. సుద్దకురవ తండా నుంచి ప్రధాన రహదారికి రావాలంటే దాదాపు రెండు కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. దారి వెంట విపరీతంగా ముళ్ల చెట్ల అల్లుకోవడంతో ఆ దారిన వెళ్లే ప్రయాణికులు, పాదాచారలు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయం గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర నాయక్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన తన సొంత నిధులతో దారి వెంట ఉన్న చెట్ల తొలగించడంతో ఆ దారి వెంట వెళ్లే వారు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు పోలేరమ్మ తిరునాళ్ల



పోలేరమ్మ ఆలయం



పోలేరమ్మ మూలవిరాట్

కురిచేడు: నూజెండ్ల, కురిచేడు మండలాల సరిహద్దులోని నరసాయపాలెం పోలేరమ్మ తిరునాళ్ల శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. అమ్మవారు మహాశక్తి వంతురాలని భక్తుల విశ్వాసం. ఆ దారిన రాకపోకలు సాగించే వాహన చోదకులు, గుంటూరు పొగాకు, మిరప పంట తరలించే రైతులు ఆ ఆలయం వద్ద ఆగి అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసుకుని వెళ్లడం ఆనవాయితీ. జిల్లాలోని వెంగాయపాలెం, పడమరవీరాయపాలెం, కురిచేడుతో పాటు పల్నాడు జిల్లాలోని నూజెండ్ల మండలంలోని చింతలచెరువు, నాగిరెడ్డిపల్లి, లింగమొక్కపల్లి, ఉప్పేపురం, ముక్కెళ్లపాడు తదితర గ్రామాల ప్రజలు అమ్మవారి ఆలయంలో మొక్కులు తీర్చుకోనున్నారు. ప్రతి ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద మొక్కులు తీర్చుకునే వారి సంఖ్య గణనీయంగా ఉంటుంది. తిరునాళ్ల వచ్చే భక్తులకు తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి ధ్వజస్తంభం ప్రతిష్ట



ప్రతిష్ఠించిన ప్రసన్నాంజనేయస్వామి



బ్రాహ్మణపల్లిలో ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

దొనకొండ: మండలంలోని పడమటి వెంకటాపురం పంచాయతీ పరిధి బ్రాహ్మణపల్లి శ్రీ ప్రసన్నాంజనేయ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సహకారంతో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నిర్మించుకున్నారు. బద్వేల్‌కు చెందిన బ్రహ్మశ్రీ ఓర్వగంటి సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో ఆయన బృందం పాల్గొని పూజలు నిర్వహించింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహిళలు తలంటి స్నానాలు చేసి ధ్వజస్తంభానికి, విగ్రహాలకు పూజలు చేశారు. విగ్రహాలను గ్రామ పురవీధుల్లో మంగళ హారతులు, భజంత్రీలతో ఊరేగించారు. గ్రామానికి చెందిన దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళ, బుధవారాలు పూజా కార్యక్రమం నిర్వహించారు. హోమం, శాంతి హారతులు, గోపురం, శిఖర కళశ ప్రతిష్ట, విగ్రహాల ప్రతిష్ట, మహా కుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ట చేశారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.